సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడ వాసి నల్లం భానుకుమార్ కుటుంబ సభ్యులు శనివారం రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు




వాడపల్లి.. భక్తులతో శోభిల్లి

కోనసీమ తిరుపతి..ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయా నికి శనివారం భక్తులు పోటెత్తారు.

8లో

కడలిలోకి 17 వేల క్యూసెక్కుల నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 17,556 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 7,100 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు



అంతర్వేది ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో 106 రోజులకు గాను హుండీల ఆదాయాన్ని లెక్కించారు. దీనిని జిల్లా దేవదాయ శాఖ అమలాపురం పర్యవేక్షణ అధికారి జె.రామలింగేశ్వరరావు, రాజోలు గ్రూపు టెంపుల్స్ ఈఓ ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాద్‌రాజు సమక్షంలో నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.36,37,308, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.22,379, అన్నదాన హుండీ ద్వారా రూ.56,625 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అన్నారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు బైరా నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, ఆలయ సిబ్బంది, స్వామివారి సేవకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం టౌన్: జిల్లాలో సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు డిమాండ్ చేశారు. 2019 నుంచి సహకార ఉద్యోగాల్లో చేరిన వారిని తొలగించాలన్న డీసీసీబీ నిర్ణయానికి వ్యతిరేకంగా కాకినాడలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం ధర్నాకు తలపెట్టామన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా సహకార ఉద్యోగులంతా తమ సంఘాల భవనాలకు సోమవారం తాళాలు వేసి ఈ ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ప్రధానంగా ఆరు డిమాండ్లపై ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సహకార ఉద్యోగులకు 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ ఇవ్వాలని, వేతన సవరణ చేయాలని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక



మల్లాడి రాజు

అల్లవరం: మండలంలోని దేవగుప్తం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మల్లాడి రాజు అండర్–17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం వేణుగోపాల్ శనివారం తెలిపారు. కాకినాడలో 15న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాజుకు పీడీ కె.రాజ్‌కుమార్ తర్ఫీదు ఇచ్చారన్నారు. ఆ ఇద్దరినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

పాఠశాలల సందర్శన

అల్లవరం: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మండలంలో పలు ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. కొమరగిరిపట్నం, గోడిలోని బాలురు, బాలికల గురుకులాలు, ఓడలరేవు, గోడిలంక, అల్లవరం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓటుని నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ దిశగా ఉపాధ్యాయ సంఘాలు ఓటుపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 16.6 మి.మీ వర్షపాతం


అమలాపురం రూరల్: వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా 16.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అయినవిల్లిలో 67.6, అత్యల్పంగా కాట్రేనికోన మండలంలో 0.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. ముమ్మిడివరం 53.6, అమలాపురం 37.0, ఐ.పోలవరం 33.6, అంబాజీపేట 30.6, ఉప్పలగుప్తం 30.2, సఖినేటిపల్లి 16.2, మామిడికుదురు 26.8, కె.గంగవరం 20.4, పి.గన్నవరం 13.8, మలికిపురం 15.4, రాజోలు 7.2, అల్లవరం 4.6, కొత్తపేట 5.4, కపిలేశ్వరపురం 2, ఆత్రేయపురం ఒక మిల్లీమీటరు వర్షం పడింది.

మాట వినకుంటే.. బెల్ట్ తీస్తాం



- మద్యం, బెల్ట్ షాపుల ఏర్పాటు నిర్ణయం కూటమి నేతలదే
- సిండికేట్ చేసేందుకు యత్నాలు
- ఫుల్‌గా తాగించేందుకు నిర్ణయాలు

సాక్షి, అమలాపురం: మద్యం ముంగిటకే తెస్తున్నారు.. వీధివీధినా బెల్టు షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు.. దీనికి సరిహద్దులూ నిర్ణయిస్తున్నారు.. ఇప్పటికే మద్యం దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి? వీటి పరిధిలో బెల్టు షాపులు ఎక్కడ పెట్టాలనే అంశాలపై కూటమికి చెందిన కొందరు నేతలు హుకుం జారీ చేశారు. సిండికేట్ నిర్ణయించిన 'హద్దులు' దాటితే 'బెల్టు' తీస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. జిల్లాలో కొత్త మద్యం పాలసీ ప్రకారం 133 మద్యం దుకాణాలను కేటాయించారు. పలుచోట్ల దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. మద్యం దుకాణాలు పూర్తి స్థాయిలో తెరిచేందుకు మరో రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. సిండికేట్‌పై స్పష్టత లేకపోవడంతో పలుచోట్ల ఆలస్యమవుతోంది. ఈసారి ప్రభుత్వం మద్యం దుకాణాలకు మున్సిపాలిటీ, మండలాల యూనిట్‌గా దరఖాస్తులు కోరిన విషయం తెలిసిందే. దీనివల్ల మద్యం వ్యాపారుల మధ్య సరిహద్దు సమస్యలు వస్తున్నాయి. ఉదాహరణకు అంబాజీపేట మండలంలో మొత్తం ఐదు మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అంబాజీపేట బస్టాండ్, మెయిన్ రోడ్డు ఇలా కిలోమీటర్ పరిధిలోనే మూడు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సిండికేట్‌పై చర్చలు జరుగుతున్నాయి. ఇంతలోనే పాత సిండికేట్‌దారులు తమ చుట్టూ ఉన్న బెల్టు షాపుల వారితో మాట్లాడుకుని వ్యాపారం ప్రారంభించడంతో మిగిలిన వ్యాపారులు మండిపడుతున్నారు. దీంతో టీడీపీలో కీలక నేతలు రంగప్రవేశం చేసి వ్యాపారులను సిండికేట్ చేసేపనిలో పడ్డారు. అంబాజీపేటలోనే కాదు.. జిల్లాలో పలుచోట్ల ఇదే పరిస్థితి ఉంది.



వారి కనుసన్నల్లోనే..

జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు, వారి సోదరులు, ముఖ్య అనుచరులు, పాత మద్యం మాఫియా కనుసన్నల్లోనే దుకాణాల సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. ఉన్నత వర్గాల నుంచి ఆదేశాలు రావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు



వీరికి వంత పాడుతున్నారు. దుకాణాల ఏర్పాటు వాటి పరిధిలో బెల్టు షాపుల నిర్ణయం వీరి కనుసన్నల్లో జరుగుతోంది. టీడీపీ మద్యం సిండికేట్ ఎంత బలంగా ఉందంటే జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలు ఉన్న పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సైతం వీరి హవా సాగిస్తున్నారు. కొత్తగా బెల్టు షాపులను కూడా తెరిపిస్తున్నారు. గతంలో కంటే ఈసారి బెల్టు షాపులు రెట్టింపు కానున్నాయని అంచనా. మద్యం దుకాణాలకు చేసిన దరఖాస్తులకు భారీగా చేతి చమురు వదలడం, ఎక్సైజ్ ట్యాక్స్ అధికంగా ఉండడంతో బెల్టు అమ్మకాలపై అధికంగా ఆశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా బెల్ట్ దుకాణాలను పెద్ద ఎత్తున తెరుస్తున్నారు. టీడీపీ కీలక నేతలు మద్యం అమ్మకాలు అధికంగా జరిగే బెల్టు షాపులను తమ వద్దనే ఉంచుకోవడం గమనార్హం.

ఎక్కడెక్కడ ఎలా అంటే..

- అమలాపురం నియోజకవర్గంలో మొత్తం 18 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 200 వరకు బెల్ట్ షాపులు వచ్చే అవకాశముంది. ఇప్పటి వరకూ కేవలం 28 బెల్ట్‌షాపులు తెరిచారు. మద్యం షాపుల మధ్య సరిహద్దులను నిర్ణయించి, తరువాత బెల్టుపై దృష్టి సారించనున్నారు. టీడీపీలో మద్యం వ్యాపారులు సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. తమ పార్టీకి చెందని వారిని సైతం సిండికేట్‌లోకి ఆహ్వానిస్తున్నారు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో దుకాణాల ఏర్పాటుపై తుది చర్చలు జరుగుతున్నాయి. ఇక్కడ మద్యం దుకాణాల కన్నా బెల్టు షాపులు పొందడంపైనే అందరూ దృష్టిసారించారు. ఎస్.యానాం, ఎస్.కొత్తపల్లి వంటి ప్రాంతాల్లో బెల్టుషాపులపై కీలక నేతలు దృష్టి సారించారంటే ఇక్కడ బెల్ట్ అమ్మకాలు ఏ స్థాయిలో జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు.
- మండపేట నియోజకవర్గంలో మద్యం దుకాణాలు ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. సిండికేట్ ఏర్పాటుపై చర్చలు నడుస్తున్నాయి. ఇవి పూర్తయితేనే బెల్టు షాపులపై ఒక అంచనాకు వచ్చే అవకాశముంది.
- కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 25 షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో కనీసం 150కి పైగా బెల్ట్ షాపులు వస్తాయని అంచనా. ఇప్పటికే నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను కొనసాగించడంతో పాటు టీడీపీ అనుకూలంగా ఉండే వారితో కొత్తగా బెల్టు షాపుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.
- రామచంద్రపురం నియోజకవర్గంలో వెల్ల గ్రామంతో బెల్ట్ షాపు బోణీ అయ్యింది. ఇక్కడ ఆరు దుకాణాలకు వేలం జరగగా, మూడు చోట్ల మాత్రమే కొత్తగా ప్రారంభించారు. దుకాణాలు పూర్తిగా తెరిస్తే బెల్టుషాపులు మొదలవుతాయని అంచనా.
- పి.గన్నవరం నియోజకవర్గంలో దుకాణాల ఏర్పాటు ప్రాంతాలపైనే ఇంకా స్పష్టత రాలేదు. దుకాణాలను పంచుకున్న తరువాతే బెల్టుషాపులపై స్పష్టత రానుంది. టీడీపీ సిండికేట్‌తో పాటు గత ఎన్నికల్లో భారీగా ఎన్నికల ఫండ్ ఇచ్చిన ఒక వ్యక్తి ఆధ్వర్యంలో ఏర్పడిన సిండికేట్‌దారులు సైతం తమ హవా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.
- ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలంలోని తీరంలో ఉండే బెల్టుషాపుల్లో లూజు సేల్స్ అధికం. కాని బెల్టుపై స్థానిక మత్స్యకార పెత్తందారుల నిర్ణయమే అంతిమం. వీటి ద్వారా పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగే అవకాశమున్నందున వీరితో స్థానిక నేత సోదరుడు చర్చలు జరుపుతున్నారు. ఐ.పోలవరం మండలంలో ఇప్పటికే బెల్టు అమ్మకాలు మొదలయ్యాయి. స్థానికంగా ఉన్న టీడీపీ నేత సోదరుడు ఆధ్వర్యంలో ఇక్కడ సిండికేట్ నడుస్తోంది.
- రాజోలులో దుకాణాల సరిహద్దులు తేలడం లేదు. ఇవి కొలిక్కి వచ్చిన తరువాతే బెల్టు షాపుల ఏర్పాటుపై ఒక అవగాహనకు రానున్నారు. కూటమి ప్రభుత్వం మద్యం విధానం ఆయా పార్టీల నాయకులకు కల్పతరువుగా మారనుంది.

ఒకరు వద్దని.. మరొకరు కావాలని

- అమలాపురం రూరల్ సీఐ పోస్టు కోసం వార్
- మంత్రి, ఎమ్మెల్యేల మధ్య పంతం

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ పోలీస్ సర్కిల్ సీఐ పోస్టింగ్ విషయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుల మధ్య అంతర్గత వార్ నడుస్తోంది. రూరల్ సీఐగా పనిచేస్తున్న పి.వీరబాబు అమలాపురం పట్టణ సీఐగా బదిలీపై వచ్చి నెల రోజులు దాటుతోంది. దీంతో ఖాళీ అయిన రూరల్ సీఐ పోస్టును అప్పటి వరకూ పి.గన్నవరం పోలీస్ సర్కిల్ సీఐగా పనిచేస్తున్న డి.ప్రశాంత్ కుమార్‌కు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆనందరావు నిర్ణయించారు.

పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్న సీఐ ప్రశాంత్‌కుమార్‌ను తన నియోజకవర్గానికి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆది నుంచి పట్టుబడుతున్నారు. ఈ నియామకానికి మంత్రి సుభాష్ ససేమిరా అంటూ అడ్డుపడ్డారు. వీరిద్దరి మధ్య ఊగిసలాడుతున్న సీఐ ప్రశాంత్ కుమార్ ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్ లేకుండా ఉండిపోయారు. అప్పటి వరకూ పి.గన్నవరం సీఐగా పనిచేస్తున్న ప్రశాంత్‌కుమార్‌కు అమలాపురం రూరల్ సీఐగా నియామకానికి ఎమ్మెల్యే ఆనందరావు సిఫారసు లెటర్ కూడా ఇచ్చేశారు. పి.గన్నవరం సర్కిల్ సీఐగా ప్రశాంత్ కుమార్ బదిలీ కాగానే ఆ సర్కిల్‌కు వెను వెంటనే వేరే ప్రాంతం నుంచి సీఐ కూడా వచ్చి విధుల్లో చేరిపోయారు. మంత్రి సుభాష్ అడ్డుపడటంతో ఈ బదిలీ పెండింగ్‌లో పడిపోయింది. ఆ పోస్టింగ్ కోసం మంత్రి, ఎమ్మెల్యే మధ్య మూడు నెలలుగా వార్ నడుస్తోంది. ఇప్పటికే మంత్రి సుభాష్ సీఐ ప్రశాంత్‌కుమార్‌ను అమలాపురం రూరల్‌కు బదిలీ చేయవద్దని పలు కారణాలు చూపుతూ రాష్ట్ర డీజీపీకి వివరించారు. ఎమ్మెల్యే ఆనందరావు కూడా పట్టు వీడకుండా రూరల్‌కు ప్రశాంతకుమార్‌ను సీఐగా తేవాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇలా మంత్రి, ఎమ్మెల్యే పోస్ట్ విషయంలో వివాదం నడుస్తోంది. నియోజకవర్గానికి చెందిన కొందరు టీడీపీ ముఖ్య నాయకులు ఇటీవల మంత్రి సుభాష్‌ను కలసి రూరల్ సీఐ విషయంలో మీరు జోక్యం చేసుకోవద్దని, అందుకు సహకరించాలని అభ్యర్థించారు. అయినప్పటికీ పంచాయితీకి తెరపడలేదు. మంత్రి, ఎమ్మెల్యేలు పట్టు వీడకుండా ఎవరి ప్రయత్నాలు వారు చాపకింద నీరులా చేయడం గమనార్హం. సీఐ ప్రశాంత్ కుమార్‌కు మాత్రం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోయినప్పటికీ ఆయన సేవలను జిల్లా ఎస్పీ కార్యాలయం మాత్రం క్రైమ్ విభాగంలో వినియోగించుకుంటోంది.

స్వయం ఉపాధి యూనిట్లను ప్రోత్సహించాలి



కొత్తపేట ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట: జిల్లాలో కొబ్బరి, ఆక్వా విలువ ఆధారిత స్వయం ఉపాధి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ జీవనోపాధుల కమిటీ పర్యటనలో గుర్తించిన అంశాలు, ఉచిత ఇసుక పాలసీ పూర్తిస్థాయి సన్నద్ధత అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొబ్బరి, ఆక్వారంగ విలువ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు మరింత చొరవ చూపి, స్థానికులకు జీవనోపాధి పెంపొందించాలని ఆదేశించారు. వివిధ పథకాల ద్వారా యూనిట్ల గ్రౌండింగ్‌కు రాయితీతో కూడిన రుణాల కల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో చిన్నతరహా ఆహార పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, అదే విధంగా వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాలు నేడు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి ద్వారా జీవనోపాధి పెంపునకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పరిశ్రమల కేంద్రం, బ్యాంకర్లు పూర్తి సమన్వయం వహించాలని సూచించారు. ఇటీవల కొత్తపేట, కపిలేశ్వరపురం కాట్రేనికోన, కె.గంగవరం మండలాల్లోని 10 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ జీవనోపాధుల కమిటీ పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధుల పెంపుదల అంశాలపై పర్యవేక్షించిందన్నారు. అనంతరం జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో పూర్తిగా నీరు తగ్గిన తరువాత ఇసుక తవ్వకాలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్‌ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ల భద్రతకు చర్యలు

ముమ్మిడివరం: ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడో అంతస్తులో ఈవీఎం, వీవీ ప్యాట్లు భద్రపర్చిన గోదాములను ఆయన ఎన్నికల, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, గోదాముల సీళ్లను క్షుణ్ణంగా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా ఈవీఎం, వీవీ ప్యాట్ల గోదాములు తనిఖీ చేస్తున్నామన్నారు. అదే విధంగా ప్రతి మూడు నెలలకోసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి భారత ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదిక పంపిస్తున్నామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, తహసీల్దార్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శివరాజు పాల్గొన్నారు.

సార్వత్రికం.. సదవకాశం



- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు
- ఇంటి దగ్గర నుంచే పది, ఇంటర్ చదివే అవకాశం

రాయవరం: వివిధ కారణాలతో చదువుకు దూరమై మళ్లీ చదువుకోవాలని ఆసక్తి ఉన్నవారి కోసం సార్వత్రిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గత ఆగస్టులోనే నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు గడువును మరోమారు ఈ నెల 25వ తేదీ వరకూ అపరాధ రుసుం లేకుండా పెంచారు. రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పది, ఇంటర్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. రెగ్యులర్ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు పూర్తి చేయలేకపోయిన వారు ఉత్తీర్ణత పొందిన వాటిలోంచి గరిష్టంగా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకుని మూడు సబ్జెక్టులతో మాత్రమే పరీక్షలు రాసే విధంగా ఈ కోర్సులు రూపొందించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు

జిల్లా	పది	ఇంటర్
కాకినాడ	1,388	4,297
కోనసీమ	649	2,890
తూర్పుగోదావరి	1,492	3,176

237 అధ్యయన కేంద్రాలు

ప్రభుత్వ గుర్తింపు పొందిన కొన్ని పాఠశాలలను అధ్యయన కేంద్రాలు (అక్రియేటెడ్ ఇనిస్టిట్యూషన్స్)గా ఎంపిక చేసి వాటి ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ తరహా కేంద్రాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 237 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 94, తూర్పుగోదావరిలో 71, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 72 కేంద్రాల్లో ప్రవేశాలు పొందవచ్చు. పదో తరగతి, ఇంటర్ మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ విధానంలో తమ కలలను సాకారం చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి రెగ్యులర్ విధానంలో మాదిరిగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గుర్తింపు ఉంటుంది. ప్రవేశాలు పొందగోరే వారు దరఖాస్తులను అధ్యయన కేంద్రాల్లో కోఆర్డినేటర్ వద్ద ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.

ఈ నెల 25 వరకూ గడువు

ఈ ఏడాది జూలై 31వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ కాగా, ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 తుది గడువుగా నిర్ణయించారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు. ఈ నెల 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించవచ్చు.

ఫీజు చెల్లింపులు ఇలా..



ఎస్ఎస్‌సీలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్నివర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్+అడ్మిషన్ ఫీజుతో రూ.1,150 చెల్లించాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ వారికి రూ. 1,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అపరాధ రుసుం ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు రూ. 200 చొప్పున ఫీజుకు అదనంగా చెల్లించాలి. ఈ ఫీజులకు అదనంగా మీసేవా చార్జీలు రూ.36 ఇవ్వాలి. ఎస్ఎస్‌సీ కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి 14 ఏళ్ల వయసు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయో పరిమితి ఉండదు.

ఇంటర్‌లో ఆరు గ్రూపులు

ఇంటర్ చదివేవారి కోసం ఆరు గ్రూపులను అందుబాటులో ఉంచారు. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి సార్వత్రిక విద్య ఒక వరం. అలాగే ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది. మధ్యలో చదువు మానేసి తిరిగి కొనసాగించుకునే వారికి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునేందుకు చక్కని అవకాశం ఇది.

– పి.సాయి వెంకటరమణ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం, అమలాపురం

అధ్యయన కేంద్రంలో సూచించిన మాధ్యమంలో నచ్చిన కోర్సును ఎంపిక చేసుకోవచ్చు. ఒకసారి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందితే ఐదేళ్ల వరకూ చెల్లుబాటులో ఉంటుంది. అధ్యయన కేంద్రంలో 30 రోజులు తరగతులకు హాజరు కావాలి.

- పదో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే వారు గ్రూపు–ఏలో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు/ హిందీ/ తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బీలోని గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్‌లో గ్రూపు–ఏలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/ హిందీ/ తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బీ ప్రధాన సబ్జెక్టుల నుంచి మూడు సబ్జెక్టులతో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంది. సార్వత్రిక పాఠశాలలో చేరేవారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు చెరకు తోట దగ్ధం

తాళ్లపూడి: మండలంలోని గజ్జరంలో శనివారం మధ్యాహ్నం పిడుగుపడి చెరకు తోట దగ్ధమైంది. ఇందులో గ్రామానికి చెందిన మద్దుకూరి పెద్దబ్బులుకు చెందిన ఐదెకరాల చెరకు తోట పూర్తిగా కాలిపోయింది. మధ్యాహ్నం వచ్చిన గాలి, వర్షం కురిసిన సమయంలో పిడుగుపడి చెరకు తోటకు నిప్పంటుకుంది. అయితే ఈ సమయంలో వర్షం కురవడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీనివల్ల పక్కనే ఉన్న మరో 18 ఎకరాల చెరకు తోటకు ప్రమాదం తప్పింది. తాడువాయి చెరకు ఫ్యాక్టరీ సిబ్బంది చెరకు తోటను పరిశీలించారు. ఈ చెరకు పనిచేయదని నిర్ధారించారు. ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

కూలీలకు అస్వస్థత

కొవ్వూరు: పెనకనమెట్టలోని ఓ పొలంలో పని చేస్తున్న ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు పిడుగుపాటుకు అస్వస్థతకు గురయ్యారు. శనివారం సాయంత్రం పిడుగుపాటుకు భారీ శబ్దం రావడంతో షాక్‌కు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన కూలీలను శనివారం రాత్రి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. సిర్రా ఉత్తెమ్మ, బండి నాగమణి, కాట్రు నారాయణమ్మ, కడియం రాణి, కొక్కిరిపాటి సుజాత, చాపల కౌసల్య, పసలపూడి గన్నెమ్మ, కొక్కిరిపాటి లక్ష్మిలు గాయపడ్డారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో ట్రాక్టర్ ఢీకొనడంతో కోరుకొండకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శనివారం రాజానగరం నుంచి కోరుకొండకు బైకుపై వెళ్తున్న ముమ్మిడివరపు రామానుజ సునీల్ (34)ను ఎదురుగా అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

కాట్రేనికోన: మండలంలోని జిల్లేళవారి పేటకు చెందిన వివాహితుడు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని కాట్రేనికోన ఎస్సై ఐ.అవినాష్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. జిల్లేళవారి పేటకు చెందిన ఓ బాలికను పక్కింటికి చెందిన వాకపల్లి ఏసుబాబు లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 11 గంటలకు బాలిక మూత్రవిసర్జనకు బయటకు రావడంతో ఏసుబాబు బలవంతంగా పట్టుకుని లైంగికంగా వేధించడంతో ఆమె పారిపోయింది. తరువాత రోజు రాత్రి 3 గంటలకు ఇంటి తలుపులు తట్టడంతో కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి మందలించినా మళ్లీ వేధించాడు. బాధితురాలి తల్లి ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటుంది. తండ్రి ఫిర్యాదుతో ఏసుబాబుపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్సై అవినాష్ తెలిపారు.

సొమ్ము హుష్‌ఖాకీ..

- చేతివాటం చూపిన పోలీసుల సస్పెన్షన్
- ఏలూరు రేంజ్ డీఐజీ ఉత్తర్వుల జారీ
- సీఐ, ఎస్సై, రైటర్, కానిస్టేబుల్‌పై చర్యలు


వీరవల్లి శ్రీనివాసరావు, నిడదవోలు సీఐ


పి.అప్పారావు, ఎస్సై, పెరవలి


సీహెచ్ బుద్దేశ్వరరావు, రైటర్, పెరవలి


ఆర్.ఎల్లారావు, కానిస్టేబుల్, పెరవలి

పెరవలి: అవినీతి ఖాకీలపై వేటు పడింది.. ‘దొరికిందెంత.. దోచిందెంత’ అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో వచ్చిన కథనంతో నలుగురు పోలీసులను ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ విషయం తూర్పుగోదావరి జిల్లాలో సంచలనం రేపింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌కు కూత వేటు దూరంలో మల్లేశ్వరం- పిట్టల వేమవరం గ్రామాల సరిహద్దులో కాలువగట్టు పక్కన పశువుల పాకలో పేకాట శిబిరంపై సెప్టెంబర్ 9వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో రూ.6.45 లక్షలు దొరికినా పోలీసులు చేతివాటం ప్రదర్శించి కేసులో కేవలం రూ.55,500 మాత్రమే చూపించి ఏడుగురు జూదరులపై రాత్రికి రాత్రే కేసు నమోదు చేశారు. తెల్లవారే సరికి కోర్టులో హాజరుపరిచారు. అది కూడా లోక్ అదాలత్‌లో పెట్టి కేవలం జరిమానాతో సరిపెట్టారు. పోలీసులు జూదరులతో కుమ్మక్కై పట్టుబడిన సొమ్ములో జూదరులకు రూ.1.50 లక్షలు తిరిగి ఇచ్చి మిగిలిన మొత్తం జేబులో వేసుకున్నారని ఆరోపణ. కాజేసిన సొమ్ముపై పోలీసుల పంపకాల్లో తేడాలు రావడంతో తర్వాత రోజు కొద్ది కొద్దిగా విషయం వెలుగులోకి వచ్చింది. ఈ అంశం జిల్లా ఎస్పీ నరసింహకిశోర్‌కు చేరడంతో ఆయన రహస్య విచారణకు కొవ్వూరు డీఎస్పీకి ఆదేశాలు ఇచ్చారు. దీనిపై ఈ నెల 3న ‘దొరికిందెంత.. దోచిందెంత’ అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో కథనం వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో విచారణ చేపట్టిన కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ వారం రోజుల పాటు ప్రత్యేక బృందాలను నియమించి జరిగిందంతా వాస్తమేనని నిర్ధారించుకుని నివేదిక సమర్పించారు. ఈ నివేదికను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఉన్నతాధికారులకు సమర్పించటంతో శుక్రవారం రాత్రి ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎలా మాయం చేశారంటే..

కొవ్వూరు డీఎస్పీ రహస్య విచారణను అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, పెరవలి గ్రామాలతో పాటు కొవ్వూరులో చేశారు. అంతే కాకుండా విచారణకు ఆదేశాలు అందిన వెంటనే పెరవలి పోలీస్ స్టేషన్‌లో సీసీ టీవీ పుటేజ్ తీసుకుని, అందులో జరిగిన తంతు అంతా క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత అవకతవకలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. జూదరులను పట్టుకుని పెరవలి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చినప్పుడు అక్కడే నిడదవోలు సీఐ శ్రీనివాసరావు కూడా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని, వీరందరి సమక్షంలోనే దోపిడీకి స్కెచ్ వేశారని గుర్తించారు. అక్కడ స్వాధీనం చేసుకున్న రూ.6.45 లక్షలను సస్పెండ్ అయిన నలుగురు పోలీసులు లెక్కించినట్లు రుజువు కావటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భాగస్వాములైన నిడదవోలు సీఐ వీరవల్లి శ్రీనివాసరావు, పెరవలి ఎస్సై పి.అప్పారావు, స్టేషన్ రైటర్ సీహెచ్ బుద్దేశ్వరరావు, కానిస్టేబుల్ ఆర్.ఎల్లారావులను సస్పెన్షన్ చేసినట్లు ఉత్వర్తులు వచ్చాయని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు.

రత్నగిరిపై డర్‌మెట్రీ..

- ఏడాదిలో వందకు పైగా సెల్‌ఫోన్లు, బ్యాగ్‌ల చోరీ
- సీసీ కెమెరాలు సరిగ్గా లేక ఇబ్బంది


వనదుర్గమ్మ ఆలయం వద్ద డార్మెట్రీ

అన్నవరం: రత్నగిరిపై దొంగతనాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.. ఇక్కడి వనదుర్గ ఆలయం ఎదురుగా డార్మెట్రీ (భక్తుల విశ్రాంతి భవనం)లో బస చేసే భక్తుల విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. మెట్లదారిన నడిచి వచ్చేవారికి దేవస్థానంలో వసతి సత్రాల్లో గదులు లభ్యం కాకపోతే ఉచితంగా బస చేసేందుకు ఈ డార్మెట్రీని దాత నిర్మించారు. ఏడాదిలో ఇక్కడ బస చేసిన భక్తులకు చెందిన వందకు పైగా సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు చోరీ చేశారు. ఇక్కడ సెక్యూరిటీ ఏర్పాట్లు చేయకపోవడం, సీసీ కెమెరాలు కూడా డార్మెట్రీ లోపలకు వచ్చే ద్వారానికి ఎదురుగా కాకుండా ఒక మూలకు ఏర్పాటు చేయడంతో ఎవరొస్తున్నారో ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. ఇది దొంగలకు వరంలా మారింది. ఈ భవనంలో ఏక కాలంలో వెయ్యి మంది సేద తీరేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ భవనంలోని మూడు అంతస్తుల్లో టాయిలెట్స్, స్నానపు గదులు కూడా ఏర్పాటు చేయడంతో భక్తుల సామాన్లు భద్రపర్చుకునేందుకు 90 లాకర్లు ఉన్నాయి. చాలా మంది భక్తులు వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారు.

దొంగతనాలు ఇలా..

ఉచిత డార్మెట్రీ కావడంతో చాలా మంది భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వెళ్తుంటారు. కొంతమంది రాత్రి వచ్చి నిద్రించి ఉదయం స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. దర్శనం అయ్యాక అన్నదాన సత్రంలో భోజనం చేసి డార్మెట్రీకి వచ్చి కొంతసేపు విశ్రాంతి తీసుకుని స్వస్థలాలకు వెళ్తుంటారు. అదే అదునుగా భావించిన దొంగలు భక్తులు నిద్రపోయారని తెలుసుకున్నాక వారి బ్యాగ్‌లు, సెల్‌ఫోన్‌లు పట్టుకుపోతున్నారు. అయినా దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందిని ఇక్కడ నియమించడం లేదు.

- ఈ డార్మెట్రీలో మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూడు అంతస్తుల్లో లాకర్లు ఉన్న ప్రదేశంలో దుస్తులు మార్చుకోవాల్సి వస్తోంది. లాకర్లను మరోచోటకు మార్చి ప్రస్తుతం లాకర్లు ఉన్న ప్రదేశాన్ని దుస్తులు మార్చుకునేందుకు వీలుగా చేస్తే ఇబ్బంది తీరుతుంది.

భద్రతా చర్యలు తీసుకుంటాం



అన్నవరం దేవస్థానం అధికారులతో చర్చించి ఉచిత డార్మెట్రీ వద్ద భద్రతా చర్యలు చేపడతాం. 24 గంటలూ సెక్యూరిటీ గార్డు ఉండేలా చర్యలు తీసుంటాం. డార్మెట్రీకి రాకపోకలు సాగించే వారి వివరాలు రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తాం.

–బి.సూర్య అప్పారావు, ప్రత్తిపాడు సీఐ


డార్మెట్రీ లోపల హాలులో విశ్రాంతి తీసుకుంటున్న భక్తులు

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా షెటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అడబాల విజయ్ శ్రీనివాస్ వెల్లడించారు. స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్-14, 17 విభాగాల్లో పోటీలు, ఎంపికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 28 వరకూ మలికిపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడనున్నారని ఎస్‌జీఎఫ్ తెలిపింది. అండర్-14 బాలుర విభాగంలో ఎ.మానస్ (వన్నె చింతలపూడి), జి.శ్రీరామ్ షాహంత (కాకినాడ), ఎం.స్టీఫెన్ శ్రీచక్రనివాస్ (పెద్దాపురం), జి.సిద్దార్థ్ (గొల్లవిల్లి), కె.మణిదాస్ రామ్ సాయిరెడ్డి (కాకినాడ), మోక్షిత జైన్ (కాకినాడ), బత్తిన పార్థు (రాజమహేంద్రవరం), బి.అభిషేక్ (రామచంద్రపురం), ఎం.కృష్ణ కార్తీక్ (సఖినేటిపల్లి), వి.హరికృష్ణ (కాకినాడ), అండర్ -14 బాలికల విభాగంలో ఎం.సాహితీశ్రీ (కోరుకొండ), ఎం.వీరా దుర్గాలక్ష్మి (కాకినాడ), ఎం.రిషిత (మండపేట), వై.రేణుకాదేవి (కాకినాడ) ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో వై.గౌతమ్‌కుమార్ (మలికిపురం), అండర్-17 బాలికల విభాగంలో బి.దివ్యశ్రీసత్య (రాజమహేంద్రవరం), జి.కవిత (కాకినాడ), ఎస్.నక్షత్ర (కాకినాడ), ఎస్.నవ్య ఇంద్రాణి (అమలాపురం), కె.ఉషశ్రీ (రాజమహేంద్రవరం), ఎంఎస్ఎస్ఐ శ్రీరమ్య (అమలాపురం), వి.మంజు రత్నశ్రీ (రాజమహేంద్రవరం), పి.లక్ష్మీ హర్షిత (కాకినాడ) ఎంపికయ్యారు.

చోరీల్లో కొత్త పుంతలు

కాకినాడ రూరల్: ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడే ముఠాలు తమ పని కోసం బాలలను వినియోగించుకుంటున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ఎన్నో ఆశలు పెట్టుకుని బడులకు పంపిస్తే వారు క్లాసులు ఎగ్గొట్టి షికార్లకు వెళ్లి కేటుగాళ్ల మాయ మాటలకు చిక్కి తమ భవిష్యత్తును బాల్యంలోనే చిదిమేసుకుంటున్నారు. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకున్న సంఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానిక బోట్‌క్లబ్ పక్కన ఓ హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఒక ఫంక్షన్ హాలు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ బైక్ తాళం తీసేందుకు యత్నించడంతో స్థానికులు గమనించి పట్టుకున్నారు. 100కు కాల్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సర్పవరం పోలీసులు అక్కడకు చేరుకోవడంతో వారిని అప్పగించారు. క్రైమ్ పోలీసులు ఇద్దరు బాలలను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. బడి ఎగ్గొట్టి బీచ్‌కు వెళ్లగా అక్కడ ఒక అన్నయ్యతో పరిచయం ఏర్పడిందని, డబ్బులు ఇస్తానని చెప్పాడన్నారు. అన్నయ్య చెప్పినట్టు పార్కింగ్ చేసిన బైక్‌లు దొంగతనం చేసి అన్నయ్యకు అప్పగిస్తామని, అతను చెప్పిన చోట కలుస్తామని బాలలు వివరించారు. బాలల సమాధానాలు పలు విధాలుగా ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. దీనిపై బాలల సమాధానం నమ్మశక్యంగా లేనందున విడిచిపెట్టామని క్రైమ్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేయలేదని సీఐ పెద్దిరాజు తెలిపారు.

వాడపల్లి.. భక్తులతో శోభిల్లి


అప్పనపల్లి బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మందపల్లి శనైశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు 35 వేల మంది ఏడు ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం, పుణ్యావచనం తదితర పూజలను ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షించారు. ఈ నెల 21 నుంచి తొమ్మిది రోజుల పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

కిక్కిరిసిన అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1,01,215 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.50,769 విరాళంగా సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,51,984 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణ రాజు అన్నారు. స్వామివారిని 2,900 మంది దర్శించుకున్నారని, 1,876 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.


వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి

శనైశ్వరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవదాయ-ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా రూ.1,55,135 ఆదాయం వచ్చింది.

సుస్వరాలు ప్రభవించే..

- తనదైన ముద్రవేసుకున్న గాయని ప్రభ
- నేడు 116 పాటలతో స్వర ప్రభంజనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వర రాగాల పల్లవి పేరుతో 51 పాటలు, స్వరవీణ పేరుతో 75 పాటలు ఏకధాటిగా పాడి సంగీత ప్రియులను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన కోరుకొండ ప్రభ కట్టిపడేశారు. ఇప్పుడు స్వర ప్రభంజనం పేరుతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ స్థానిక ఆనంకళా కేంద్రంలో ఏకధాటిగా 116 పాటలు పాడి సంగీత ప్రియులను అలరించనున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాజవొమ్మంగి మండలం వాతంగి గ్రామానికి చెందిన రాజనాల బాబూరావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె కోరుకొండ ప్రభ. ఆ గ్రామంలో తల్లిదండ్రులు హోటల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. కోరుకొండ ప్రభ ఏడో తరగతి వరకూ చదువుకుంది. హోటల్‌లో తల్లిదండ్రులకు సాయం చేస్తుండేది. 11 ఏళ్ల వయసులో ప్రభ పూరీలు నొక్కుతూ పాటలు పాడుతుండగా, ఆ సమయంలో హోటల్‌కు టిఫిన్‌కు వచ్చిన సామర్లకోటకు చెందిన ఆర్కెస్ట్రా నిర్వాహకుడు శ్రీనివాస్ విని అభినందించాడు. అప్పుడు ఆయన ప్రభ తల్లిదండ్రులను ఒప్పించి తనతో పాటు పాటలు పాడేందుకు తీసుకు వెళ్లాడు. అప్పటి నుంచి ఆర్కెస్ట్రాలు, బ్యాండ్‌లో పాటలు పాడుతూ ముందుకు వెళ్లింది. రాజమహేంద్రవరానికి చెందిన దుర్గాప్రసాద్‌ను ఆమె వివాహం చేసుకుంది. భర్త దుర్గాప్రసాద్ ప్రోత్సాహంతో రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో పాటలు పాడుతూ గాయనిగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంది. సోగ్గాడు శ్రీశోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 2021 మార్చి 21న స్థానిక విక్రమ్ హాల్లో స్వరసరాగాల పల్లవి పేరుతో 51 పాటలు ఏకధాటిగా పాడి 51 అర్ధ శత గానప్రభ బిరుదుతో, 2022 సెప్టెంబరు 11న విక్రమ్‌హాల్లో స్వరవీణ పేరుతో 75 పాటలు ఏకధాటిగా పాడి వజ్రామృత గానప్రభ బిరుదుతో కోరుకొండ ప్రభ సత్కారం అందుకుంది. ఇప్పుడు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ శ్రీవేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ‘స్వర ప్రభంజనం’ కార్యక్రమంలో సినీ సంగీత విభావరి పేరుతో 116 పాటలు ఏకధాటిగా ప్రభ పాడనుంది.

ప్రోత్సాహం మరువలేనిది



గాయనిగా రాణించడంలో తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం మరువలేనిది. సుప్రసిద్ధ గాయని చిత్రను స్ఫూర్తిగా తీసుకుని పాటలు పాడుతుంటాను. నేను పాడే పాటల్లో ఎక్కువ ఆమె పాడిన పాటలే ఉంటాయి. తాను గాయనిగా ఎదగడానికి సామర్లకోట ఆర్కెస్ట్రా శ్రీను బాబాయి, దొడపాటి సుబ్రహ్మణ్యం, బ్రహ్మం, మున్సిపల్ ఉద్యోగి అలీలతో పాటు అనేకమంది గాయనీ గాయకులు కారణం. 51 పాటలు, 75 పాటలను మంచినీరు సైతం తాగకుండా పాడాను.

–కోరుకొండ ప్రభ, గాయని, రాజమహేంద్రవరం